రోడ్డు పనులకు మోక్షమెప్పుడో?

- పూర్తికాని ముస్తాబాద్, దుబ్బాక రోడ్డు విస్తరణ పనులు
- ఇప్పటికే రూ.14 కోట్లు మంజూరు
- టెండర్ పూర్తయ్యాక నిధులు వెనక్కి..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్న ముస్తాబాద్ - దుబ్బాక రహదారి

ముస్తాబాద్: ముస్తాబాద్, దుబ్బాక అంతర్ జిల్లా రహదారిని ఏళ్ల క్రితం నిర్మించారు. రెండు జిల్లాలను అనుసంధానం చేసే ఈ రహదారిని డబుల్ లైన్‌గా మార్చాలని ముప్పై ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్తాబాద్ నుంచి జిల్లా సరిహద్దు మోహినికుంట వరకు రోడ్డు విస్తరణకు రూ.14 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికాగా పనులు మొదలయ్యే లోపే ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, పనులు కూడా రద్దయ్యాయి.

నిలిచిన పనులు

ముస్తాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రానికి 14 కిలోమీటర్లు. యాభై ఏళ్ల క్రితం సింగిల్‌లైన్ బీటీరోడ్డు వేశారు. దుబ్బాక మండల ప్రజలు సిరిసిల్ల, వేములవాడ వెళ్లేందుకు ముస్తాబాద్ మీదుగానే ప్రయాణిస్తారు. నేత కార్మికులు దుబ్బాక నుంచి సిరిసిల్లకు రాకపోకలు సాగిస్తారు. ముస్తాబాద్ నుంచి దుబ్బాకకు ఇక్కడి నుంచి వెళ్తారు. ముస్తాబాద్ మండలంలో మారుమూల గ్రామాలను కలుపుతూ ఎన్నో రోడ్లను డబుల్ లైన్లుగా విస్తరించారు. కానీ ముస్తాబాద్, దుబ్బాక రహదారి మాత్రం అలాగే ఉంది. ఐదేళ్ల క్రితం దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్న రామలింగారెడ్డి అసెంబ్లీలో రహదారి దుస్థితిని వివరించారు. స్పందించిన అధికారులు దుబ్బాక నుంచి వారి సరిహద్దు గ్రామం రాజక్కపేట వరకు నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టారు.

ఎన్నికల కోడ్‌తో..

ముస్తాబాద్ నుంచి మోహినికుంట జిల్లా సరిహద్దు వరకు ఉన్న 5.4 కిలోమీటర్ల రోడ్డుకు గత ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభించలేదు. నూతన ప్రభుత్వం వచ్చాక, ఆర్అండ్‌బీ అధికారులు టెండర్‌ను రద్దు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. మోహినికుంట నుంచి దుబ్బాక వరకు డబుల్‌రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయి. కేవలం ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు 5.4 కిలోమీటర్ల రహదారిని విస్తరిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రయాణికులు తెలుపుతున్నారు.

నిత్యం ప్రమాదాలు

ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు సింగిల్ లైన్ రోడ్డు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముస్తాబాద్ నుంచి మద్దికుంట గ్రామాల మధ్య ఉన్న సింగిల్‌లైన్ బీటీ కయ్యలు కొట్టుకుపోయింది. వాహనాలు ఎదురెదురుగా వస్తే రోడ్డు దిగే పరిస్థితి లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి, పదుల సంఖ్యలో ప్రాణాలు పోయాయి. రాత్రివేళలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిధులు మంజూరు చేయాలి



దుబ్బాకకు డబుల్‌లైన్ రోడ్డు వేయాలి. ఎమ్మెల్యే కేటీఆర్ నిధులు మంజూరు చేయిస్తే కొత్త ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. పాలకులు ఇప్పటికైనా స్పందించి నిధులు మళ్లీ తీసుకురావాలి.
– రాచమడుగు సంతోష్‌రావు, ముస్తాబాద్

పనులు చేపట్టాలి



ఎన్నో ఏళ్లుగా దుబ్బాక వైపు రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకసారి నిధులు మంజూరు అయ్యాక తిరిగి వెళ్లడం సరికాదు. ఈ దారిగుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టాలి.
– అంజాగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు

మరోసారి ప్రతిపాదనలు



ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి మరోసారి ప్రతిపాదనలు పంపిస్తాం. గతేడాది మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. సిద్దిపేట జిల్లా వైపు పనులు చివరిదశలో ఉన్నాయి.
– నరేందర్, ఏఈ, ఆర్అండ్‌బీ, ముస్తాబాద్

వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని 24 గ్రామాల్లో మంగళవారం నాయకులు వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, రాచర్లబొప్పాపూర్, తిమ్మాపూర్‌లో ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములుగౌడ్, సందీప్, పాశం దేవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా ఉండే వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మండలంలో బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, శెరయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ రాష్ట్ర నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్ మండల నాయకులతో కలిసి వెంకట్రావుపల్లిలో ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ ఎంపీపీలు భాగ్యలత, మాధవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

వేములవాడ/వేములవాడరూరల్/ముస్తాబాద్/కోనరావుపేట/వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/వీర్నపల్లి/చందుర్తి: జిల్లావ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. దీంతో ఆరుగాలం శ్రమించి ఎండించిన ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముస్తాబాద్ మండలంతోపాటు పోతుగల్, గూడెం, ఆవునూర్, నామాపూర్, చిప్పలపల్లి కేంద్రాల్లో ధాన్యం తడిసింది. వేములవాడ రూరల్ మండలం.. హన్మాజిపేటలో పద్మ అనే మహిళకు చెందిన రేకుల షెడ్డు కూలిపోయింది. బొల్లారంలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కోనరావుపేట మండలం మంగళపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలోకి వరద నీరు చేరింది. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని బొజ్జపల్లిలో రేగుల శేఖర్, శాలరామన్నపల్లిలో నగునూరి సురేశ్ చెందిన రేకుల షెడ్లు గాలివానకు లేచిపోయాయి.


చందుర్తి: కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు


బోయినపల్లిలో రోడ్డుపై విరిగిపడిన చెట్ల కొమ్మలు


కోనరావుపేట: మంగళ్లపల్లిలో హనుమాన్ ఆలయంలోకి చేరిన వరదనీరు


వేములవాడఅర్బన్: శాలరామన్నపల్లిలో లేచిపోయిన రేకుల షెడ్


వేములవాడ అర్బన్: బొజ్జపల్లిలో..


ముస్తాబాద్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

‘ఉర్సు’కు రావాలని ఆహ్వానం


షబ్బీర్ అలీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న మైనార్టీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామంలో దుర్వేషావలి దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీకి మంగళవారం ఉత్సవ నిర్వాహకులు షేక్ అజీజ్ ఆధ్వర్యంలో ముస్లిం కమిటీ సభ్యుడు ఆహ్వానపత్రిక అందజేశారు. అజీజ్ మాట్లాడుతూ..ఈనెల 15న ఉర్సు ఉత్సవాల్లో భాగంగా కవ్వాలి కార్యక్రమాలు జరుగుతాయని, ఏటా ఉత్సవాలకు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరతారని తెలిపారు. ఇబ్బందు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షాదుల్లా, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సాహెబ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ లాల్, మహమ్మద్ ఫజల్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండి సంజయ్

వేములవాడ: వేములవాడలో బుధవారం జరిగే జనసభను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ అన్నారు. బహిరంగ సభవేదికను మంగళవారం ఆయన పరిశీలించారు. బహిరంగ సభకు వచ్చేవారికి అన్నిఏర్పాట్లు చేశామన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఐదెకరాలు పైబడిన రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున 1,086 ఎకరాలకు నష్ట పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గౌస్,రాజునాయక్, రాజేందర్, బాబు, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, మల్లయ్య, అనిల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

గంభీరావుపేట: ఆపదలో ఉన్న మిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచి ఆర్థికసాయం అందించారు. మండలంలోని కోళ్లమద్ది గ్రామానికి చెందిన చాత్రబోయిన లింగం ఆరునెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. అతనితో జెడ్పీ ఉన్నత పాఠశాల కొత్తపల్లిలో 2003–04లో పదోతరగతి చదివిన స్నేహితులు రూ.13వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో దేవయ్య, రాజు, దేవరాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


బీజేపీలో చేరుతున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ సొంత గ్రామమైన రామన్నపేటకు చెందిన యువకులు మంగళవారం జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ , జిల్లా కార్యదర్శి సురేందర్ రావు సమక్షంలో చేరారు. జెడ్పీ చైర్ పర్సన్‌పై అసంతృప్తితో తాము బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రం పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’


ముస్తాబాద్‌లో బీజేపీ నాయకుల బైక్‌ర్యాలీ


గంభీరావుపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: నిరుపేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లిలో మంగళవారం ఎంపీ బండి సంజయ్‌కు మద్దతుగా బైక్ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు నంది నరేశ్, సత్యంరెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, దాసరి గణే, సంజీవరెడ్డి, రాజుయాదవ్, బాలయ్య, కార్తీక్, బాలాగౌడ్, భాను, స్వామి, లక్ష్మణ్, ప్రకాశ్, కిరణ్‌నాయక్, రామచంద్రం, గణేశ్ , ,శ్రీశైలం, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అన్నారు. ముస్తాబాద్, నామాపూర్, చిప్పలపల్లి, చీకోడు, బందనకల్, ఆవునూర్, గూడెం గ్రామాల్లో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ప్రధానమంత్రి మోదీ భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. బీజేపీ నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, గిరిధర్‌రెడ్డి, శంకర్, నరేశ్, రమేశ్‌రెడ్డి, క్రాంతి, కృష్ణ, వెంకటేశ్, వెంకన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రధానిగా మోదీని మరోసారి గెలిపించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేటలో చాయ్‌పై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు బైరగోని సురేశ్ గౌడ్, తదితరులున్నారు.

గంభీరావుపేట: వేములవాడలో నిర్వహించ తలపెట్టిన ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మంగళవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సముద్రలింగాపూర్, గోరంట్యాల, గజసింగవరం, దమ్మన్నపేట, నాగంపేట గ్రామాల్లో బీజేపీకి ఓట్లు వేయాలని కోరారు. నాయకులు కానపూరం లక్ష్మణ్, మంగళి చంద్రమౌళి తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి


ఎల్లారెడ్డిపేట: హరిదాస్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి


బోయినపల్లి: స్తంభంపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మిపతి, చంద్రగిరి వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్, పదిర, వెంకటాపూర్, గాజులపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.రాచర్లగుండారం గ్రామానికి చెందిన 30 మంది యువకులు మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, రాజేందర్, బాబు, రాములు, వెంకట్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, మందాటి దేవేందర్‌యాదవ్, రామచంద్రం, వంగ మల్లారెడ్డి, పర్శరాములు, అనిల్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: మండలంకేంద్రంలో వెలిచాల రాజేందర్‌కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఉపాధి హామీ పనుల వద్ద ప్రచారం నిర్వహించారు ఎంపీటీసీ దేవరకొండ నరసింహచారి, మాజీ జెడ్పీటీసీ గొట్టే రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు. పల్లిమక్త, మర్తనపేట, కనగర్తిలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. గ్రామశాఖ అధ్యక్షుడు బోనాల పునీత్, వంగపల్లి దేవరాజు, నాయిని ప్రభాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ నియోజకవర్గ ఎన్నికల కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి ఓ చెట్టెక్కి ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వీర్నపల్లి : మండలకేంద్రంలో గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోర రాజు పాల్గొని ఆరు గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, లక్ష్మణ్, కుమార్, పాటి దినకర్, కార్తీక్ , తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ బైక్ ర్యాలీ

సిరిసిల్లటౌన్: ప్రధాని మోదీ వేములవాడ పర్యటనను ఆహ్వానిస్తూ మంగళవారం సిరిసిల్లలో బీజేపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది సంఖ్యలో బైక్‌లపై పార్టీ కార్యకర్తలు, అభిమానులు నమో మోదీ నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. బుధవారం వేములవాడకు మోదీ వస్తున్న సందర్భంగా జరిగే భారీ బహిరంగ సభకు తరలిరావాలని నాయకులు కోరారు. పట్టణంలోని ప్రధాన వీధులు, నేతకార్మిక వాడల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా, రాష్ట్ర శాఖల నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల్లో తనిఖీలు

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామంలోని అనుమానిత బెల్ట్‌షాపుల్లో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఎంపీవో ఏ. గంగాతిలక్, సిబ్బంది గౌతమ్ తదితరులు ఉన్నారు.